26-09-2026:Layout 1 9/26/2026 11:44 PM Page 1




# నేటి దిక్సూచి

www.netidiksuchi.com

తెలుగు దినపత్రిక

TGTEL/25/A3190




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :346 ఎడిటర్ పి. అలివేలు, పేజీలు : 08 వెల. 4రూ/ ఆదివారం - 27 - సెప్టెంబర్ -

## గ్రామీణాభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు

# మంచినీటికి అత్యధిక ప్రాధాన్యత -- మంత్రి సీతక్క





రంగారెడ్డి నేటి ప్రభాత సూర్య:రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా అంశాలపై ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం మంత్రి సీతక్క పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాబోయే కాలంలో వర్షాభావ పరిస్థితులు, వరదలు, మంచినీటి అవసరాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని ప్రాంతాల వారీగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు.

**గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.3,382 కోట్లు:**

ఉమ్మడి నాలుగు జిల్లాల పరిధిలో 1,013 గ్రామీణ రహదారుల అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం సుమారు రూ.3,382 కోట్లను వెచ్చించనున్నట్లు వెల్లడించారు. దసరా అనంతరం అక్టోబర్ 25 లేదా 26వ తేదీ నుంచి గ్రామీణ రహదారులకు సంబంధించిన పనులను ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. పనుల నాణ్యత, పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

**మంచినీటికి అత్యధిక ప్రాధాన్యత:**

వర్షపాతం లోటు కారణంగా ఏర్పడే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మంచినీటి సరఫరాకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. సింగూరు జలాశయంలో నీటి నిల్వలు పరిమితంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ బోర్లు, బావులు, ఇతర స్థానిక నీటి వనరులను వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. రానున్న వేసవి వరకు మంచినీటి సమస్య తలెత్తకుండా ఉమ్మడి నాలుగు జిల్లాలకు సుమారు రూ.30 కోట్ల మేర అవసరమైన నిధులను సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

***జలశ్రీ'తో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలి:***

భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు నీటి సంరక్షణకు 'జలశ్రీ' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇంటికి ఇంకుడు గుంత, పంటకు పంట కుంట, ఊరికి ఊట కుంట, బోరు రీచార్జ్ వంటి పనులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోనూ నీటి సంరక్షణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.




**ఉపాధి హామీ పనులతో గ్రామాల అభివృద్ధి:**

ఉపాధి కల్పనతో పాటు గ్రామాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయడానికి ఉపాధి హామీ పథకం నిధులను సమ-ర్థవంతంగా వినియోగించాలని మంత్రి సూచించారు. కాలువలు, డ్రైనేజీలు, సోక్‌పిట్లు, ఫామ్ పాండ్లు, చెరువుల అభివృద్ధి, గ్రామీణ మౌలిక వసతుల నిర్మాణం వంటి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**గ్రామపంచాయతీ, మహిళా భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత:**

రాష్ట్రంలో అవసరమైన చోట గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో చేపట్టిన సుమారు 3,000 గ్రామపంచాయతీ భవనాల్లో దాదాపు 1,000 భవనాలు పూర్తయ్యే దశలో ఉన్నాయని, ఈసారి మరో 1,800 భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



అదేవిధంగా 9,000కు పైగా మహిళా భవనాల నిర్మాణాన్ని కూడా చేపడుతున్నట్లు వెల్లడించారు.

**గ్రామ సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి:**

ప్రతి గ్రామానికి సమగ్ర ప్రణాళిక రూపొందించి, గ్రామంలోని చెరువులు, వాగులు, పాఠశాలలు, ఇంకుడు గుంతలు, ఇతర మౌలిక వసతులను మ్యాప్‌లో గుర్తించి అవసరమైన అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టేందుకు సర్పంచులకు శిక్షణ ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులపై తీర్మానాలు చేసి, అందుబాటులో ఉన్న నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని సర్పంచులకు మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.

